సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 9 । జనవరి । 2023



ఇది ఉద్యోగుల ప్రభుత్వం

ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ఇది ఉద్యోగుల ప్రభుత్వమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. -8లో..



సాహితీ లోకంలో కొత్త ఉషస్సు

అక్షరం ఆమె చేతిలో చురుకైన శరమైంది. తెలుగు టీవీ సీరియళ్ల రంగంలో తనదైన ముద్ర సాధించారు జిల్లావాసి ఉషారాణి . -10లో..

గరిష్టం/కనిష్టం
29.9 /17.7

వాతావరణం

జిల్లాలో ఆదివారం 17.7 – 29.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

లింగాలలో నాడు-నేడులో పూర్తయిన రెండస్తుల భవనం



బడి.. భళా

- సరికొత్తగా సర్కారీస్కూళ్లు
- నాడు- నేడుతో మారిపోతున్న రూపురేఖలు
- రెండో దశలో జిల్లాలో 1,007 పాఠశాలలు ఎంపిక
- విద్యార్థులు చదువుపై పూర్తిగా దృష్టి సారించేలా చర్యలు

నాడు నేడు

కడప ఎడ్యుకేషన్‌: అరకొర వసతులతో కళావిహీనంగా కనిపించే సర్కారు బడులు నేడు కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి. పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే తొలి విడత కింద 1,000 పాఠశాలలను రూ. 270 కోట్ల ఖర్చుతో సుందరంగా తీరిదిద్దగా తాజాగా రెండో విడత కింద మరో 1,007 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్‌ కళాశాలల్లో రూ.294 కోట్లతో జిల్లాలో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని అమలు చేయడంతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్‌ కంపెనీతో టై అప్‌ అయి జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నారు. జిల్లాలో 39 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు టీచర్లకు శిక్షణ కూడా పూర్తి చేశారు. ఇన్ని రకాల చర్యలు తీసుకుని ప్రభుత్వ బడుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడతలో...

జిల్లావ్యాప్తంగా రెండో విడత కింద 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 634 ప్రాథమిక , 82 ప్రాథమికోన్నత పాఠశాలలు, 195 హైస్కూల్స్‌, 9 జూనియర్‌ కళాశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. వీటిలో నాడు – నేడు పనులు, అదనపు తరగతి గదులు, మైనర్‌, మేజర్‌ రిపేర్లకు సంబంధించిన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొత్తగా నాడు- నేడు నిర్వహించే పాఠశాలల్లో 10 రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకోసం రూ. 294.80 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.59.57 కోట్లు ఖర్చు చేశారు. దాదాపు 92 శాతం మేర పనులు పూర్తయ్యాయి.

- మొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేపట్టిన నాడు- నేడు పనులను రెండో విడతలో మరో అడుగు ముందుకేసి అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు జూనియర్‌ కళాశాలల్లో కూడా చేపట్టారు.

ఐదు ఇంజినీరింగ్‌ డిపార్టుమెంట్లతో పనులు...

కార్పొరేట్‌ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నాడు- నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంబంధిత పనులను ఐదు డిపార్టమెంట్ల వారు చేపట్టారు. పీఆర్‌, ఎస్‌ఎస్‌ఏ, పీహెచ్‌ఈడీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజినీరింగ్‌ డిపార్టుమెంట్‌ వారు ఈ పనులను చేపట్టారు. ఇందులో 108 స్కూళ్లలో పంచాయితీరాజ్‌ డిపార్టుమెంట్‌వారు ఇప్పటి వరకు రూ. 450.8 లక్షలు ఖర్చు చేసి 94.77 శాతం మేర పనులు పూర్తి చేశారు. 169 పాఠశాలల్లో సమగ్రశిక్ష ఇంజినీరింగ్‌ డిపార్టుమెంట్‌ వారు రూ. 933.75 లక్షలు ఖర్చు చేసి 94.41 శాతం మేర, 193 స్కూళ్లలో పబ్లిక్‌ హెల్త్‌ అండ్‌ ఇంజినీరింగ్‌ డిపార్టుమెంట్‌ వారు రూ. 1230.58 లక్షలు ఖర్చు చేసి 92.89 శాతం పనులను, 218 పాఠశాలల్లో ఏపీఈడబ్ల్యూఐడీసీ వారు రూ. 1255.21 లక్షలు ఖర్చు చేసి 90.34 శాతం పనులను, 319 స్కూల్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్‌ వారు రూ. 1268.75 లక్షలు ఖర్చు చేసి 88.77 శాతం మేర పనులను పూర్తి చేశారు.

15 మందితో సభ్యుల కమిటీ..

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ, జూనియర్‌ కళాశాలల్లో చేపట్టిన నాడు- నేడు రెండో విడత అభివృద్ధి పనుల పర్యవేక్షణకు 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. వీరు పనులు ఎలా జరగుతున్నాయి..సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకుంటారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటారు.

రెండో విడతలో చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు..

1 తాగునీరు సరఫరా
2. నిరంతరం నీటి సరఫరాతో మరుగుదొడ్లు
3. మేజర్‌, మైనర్‌ మరమ్మతులు
4. లైట్లు, ఫ్యాన్‌లతో సహా విద్యుద్దీకరణ
5. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్‌
6. తరగతి గదులకు పెయింటింగ్‌
7. గ్రీన్‌ చాక్‌ బోర్డులు
8. వంటగది నిర్మాణం
9. ప్రహరీ గోడలు
10. ఆదనపు తరగతి గదుల నిర్మాణం



కడపలోని మున్సిపల్‌ హైస్కూల్‌ మొయిన్‌లో నాడు- నేడు పనులు

కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	అంచనా వ్యయం రూ.లక్షల్లో	సీఎఫ్‌ఎంఎస్‌ ద్వారా చెల్లించిన నిధులు రూ.లక్షల్లో	ఖర్చు చేసిన నిధులు రూ.లక్షల్లో
అంగన్‌వాడీలు	87	1392.47	199.73	199.01
ప్రైమరీస్కూళ్లు	634	9812.1	2123.88	2094.48
యూపీ స్కూల్స్‌	82	1515.41	362.49	352.28
హైస్కూళ్లు	195	16058.72	3297.35	3203.7
కళాశాలలు	09	709.25	139.07	107.54

నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు- నేడు పనులు నాణ్యతతో జరుగుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మాతో పాటు పాఠశాలల తల్లితండ్రుల కమిటీలు, పధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పనుల నాణ్యతను ఇంజినీరింగ్‌ అధికారులు చూసుకుంటారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి



అభివృద్ధే లక్ష్యం



పెన్నానదిపై హైలెవెల్‌ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు

- ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి
- ప్రొద్దుటూరు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యేతో కలిసి భూమిపూజ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి స్పష్టంగా మార్పు తీసుకొచ్చేలా కృషి చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు తనను ఆదేశించారని ఎంపీ తెలిపారు. ఆదివారం రూ.53 కోట్లతో ప్రొద్దుటూరు – ఆర్టీపీపీ మధ్యన రామేశ్వరం పెన్నానదిపై నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లుతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సీఎం శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల్లో ఒక్కొక్కటి ప్రారంభమవుతునానయన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బ్రిడ్జి నిర్మాణం ఉక్కు ఫ్యాక్టరీకి వెళ్లేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడంతో ఇతర మార్గాల ద్వారా ఆర్టీపీపీకి, ముద్దనూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.

నియోజకవర్గానికి రూ.3 వేల కోట్ల మంజూరు: ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివద్ధికి రూ.3 వేల కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు – ఆర్టీపీపీ మధ్యన రామేశ్వరం పెన్నానదిపై నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ పరిధిలోని మహిళలకు రూ.1076 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రత్యేకంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రూ.520 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగానే అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం, ఎస్‌సీఎస్‌ఆర్‌ కళాశాల, వైఎస్సార్‌ ఇంజనీరింగ్‌ కాలేజీ, బస్టాండ్‌, మార్కెట్‌ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. రూ.150 కోట్లతో నిర్మిస్తున్న పైపులైన్‌ నిర్మాణం 99 శాతం పూర్తయిందన్నారు. ముందుగా రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ శారద, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, రాష్ట్ర ఆదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్‌ నంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఫుడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గండికోట ఫొటో ప్రదర్శన

కడప కల్చరల్‌ : ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం ఇండియన్‌ గ్రాండ్‌ క్యానియన్‌గా పేరుగాంచిన గండికోట ఫొటోల ప్రదర్శనను సోమవారం ఉదయం 11 గంటలకు హోటల్‌ గ్రాండ్‌ ఇన్‌లో నిర్వహిస్తున్నామని రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. గండికోట ఆవిర్భావ దినోత్సవం (జనవరి 9న) పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. దీనికి గండికోట రాజవంశీయులు వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యాటక ప్రియులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఇన్‌స్పైర్‌ మనాక్‌కు 272 ప్రాజెక్టులు ఎంపిక

కడప ఎడ్యుకేషన్‌: ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లా నుంచి 2022–23వ విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్‌ మనాక్‌కు 1986 నామినేషన్లను అప్‌లోడ్‌ చేయగా నేషనల్‌ ఇన్నోవేషన్‌ ఫౌండేషన్‌ వారు వీటిలో సృజనాత్మకమైన 272 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. 272 మందికి వారి ఖాతాలకు పది వేల రూపాయలు జమ అవుతుంది. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా నుంచి ఎంపికైన 272లో పునర్విభజన తర్వాత మిగిలిన వైఎస్సార్‌జిల్లా నుంచి 182, నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు 90 ప్రాజెక్టులు ఉన్నాయి. విద్యారులు, వారిని ఉపాధ్యాయులకు డీఈఓ దేవరాజు, జిల్లా సైన్స్‌ అధికారి మహేశ్వరెడ్డి అభినందనలు తెలిపారు.



జిల్లాకు ఎంపికైన ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా సైన్స్‌ అధికారి

ప్రొద్దుటూరులో ఏఐఎస్‌ఎఫ్‌ మహాసభలు

కడప సెవెన్‌రోడ్స్‌ : ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా 18వ మహాసభలు ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌, వలరాజులు తెలిపారు. ఆదివారం కడపలోని సంఘం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యారంగ, సామాజిక అంశాల పట్ల వీరోచిత పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్‌ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు 117ను రద్దుచేయాలని కోరారు. సంఘం నగర కార్యదర్శి సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులు శివశంకర్‌ పాల్గొన్నారు.

త్వరలో ఉక్కు ఫ్యాక్టరీకి సీఎం భూమి పూజ: ఎంపీ

జమ్మలమడుగు నియోజకవర్గంలో జేఎస్‌డబ్ల్యూ ఉక్కు కర్మాగారం నిర్మాణానికి త్వరలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ భూమి పూజ చేస్తారని ఎంపీ వైఎస్‌ అవినాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. ఉక్కు కర్మాగారం నిర్మాణానికి 2020లో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటికే ఉక్కు కర్మాగారానికి సంబంధించి భూ సేకరణ పూర్తియిందని, పర్యావరణ అనుమతులు వచ్చాయని, రోడ్లు మంజూరయ్యాయని ఎంపీ తెలిపారు. కర్మాగార నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులు రావడంతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమి పూజ జరుగుతుందన్నారు. రెండేళ్లలో ఉక్కు కర్మాగారం తొలి దశ పూర్తవుతుందన్నారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆప్కాబ్‌ చైర్‌పర్సన్‌ మల్లేల ఝాన్సీరాణా రాజారాంరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్‌ యాదవ్‌, సర్పంచ్‌ ప్రశాంతి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: దుస్తుల దుకాణంలో కిక్కిరిసిన ప్రజలు

అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు



సంక్రాంతి వచ్చిందే.. తుమ్మెదా

సంక్రాంతి..ఇది ఒక పండుగ మాత్రమే కాదు. ఎన్నెన్నో అనుభూతులు, మరెన్నో మేళవింపులు..భావోద్వేగాలు..ఒక మాటలో చెప్పాలంటే ఏడాదికి సరిపోయే ఎన్నో తీపి జ్ఞాపకాల సంబరం..అలాంటి పండుగ మరో వారంరోజుల్లో రానుంది. అంతకన్నా ముందే జిల్లాలో పండుగ జోష్‌ మైదలైంది. ముగ్గులతో ఇంటి ముంగిళ్లు కళకళలాడుతున్నాయి. పట్టణాల్లోని వారే కాక గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా షాపింగ్‌ కోసం ఆయా ప్రాంతాల్లోని పట్టణాలకు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 వరకు పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి. దుస్తుల దుకాణాలు, కిరాణా షాపులు కిక్కిరిస్తున్నాయి.సింహభాగం వ్యాపారం దుస్తులు, వంట సరుకుల ద్వారానే సాగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహిళలు అలంకరణకు సంబంధించిన వస్తువలను జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

- రంగవల్లులతో అందంగా తయారైన ముంగిళ్లు
- ఊపందుకున్న పెద్దపండుగ వ్యాపారం

రాజంపేట టౌన్‌ : పండగంటే ఆఫర్లు....ఆఫర్లుంటేనే ఆకర్షణ. ఇదే మంత్రాన్ని అనేక మంది వ్యాపారులు పాటిస్తున్నారు. కొంతమంది ప్రజలను ఆకర్షించేందుకు కొన్ని రకాల దుస్తులు, మహిళలకు సంబంధించిన వస్తువులపై, పాదరక్షలపై డిస్కౌంట్‌ ఆఫర్లు పెట్టారు. గత వారం రోజులుగా రోజు, రోజుకు వ్యాపారాలు ఊపందుకుంటున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నిత్యం కోట్ల రూపాయిల్లోనే వ్యాపారాలు సాగుతున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్‌లో జోరుగా కొనుగోళ్లు

ప్రస్తుతం అందరి చేతిలో స్మార్ట్‌ ఫోన్‌ ఉంది. దీంతో చాలా మంది ఆన్‌లైన్‌ ద్వారా షాపింగ్‌ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్‌ వస్తువులను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం సంక్రాంతి కావడంతో పురుషులు ఫ్యాంట్లు, షర్ట్స్‌, షూస్‌, మహిళలు చీరలు, చిన్నపిల్లల దుస్తులు, రోల్డ్‌గోల్డ్‌ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్‌ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ౼.హిందువులకు సంక్రాంతి పెద్దపండుగ.అందువల్ల నిరుపేదలు కూడా ఈ పండుగను ఉన్నంతలో ఘనంగా జరుపుకుంటారు. బంధువులను, ఆడబిడ్డలను, అల్లుళ్లనువిధిగా ఆహ్వానిస్తారు. ఇంటికి వచ్చిన అతిధులకు వారివారి స్థోమతను బట్టి దుస్తులు పెట్టి, ఆతిధ్యాలు ఇస్తారు. సంక్రాంతి సందర్భంగా పేదలకైనా తక్కువలో తక్కువ అంటే పదివేల రూపాయిలు ఖర్చవుతుంది. ఎక్కువ సంఖ్యలో బంధు వర్గం కలిగిన ధనవంతులు సంక్రాంతికి లక్ష రూపాయిలు కూడా ఖర్చు చేస్తారు.

సంప్రదాయాన్ని పాటిస్తాం



పెద్దపండగ సంవత్సరానికి ఒకసారి వస్తుంది. మేము చిన్నప్పటి నుంచి ఇంటిల్లిపాది సంక్రాంతికి కొత్త దుస్తులు కొంటాం. కాలం మారినా ఈ సంప్రదాయాన్ని మాత్రం పాటిస్తున్నాం.పండుగను ఉన్నంతలో సంతోషంగా జరుపుకోవాలి. – సిద్దమ్మ, వెంకటాపురం, ఓబులవారిపల్లె మండలం



ముత్యాల ముగ్గులు..అందమైన ముంగిళ్లు

కడప కల్చరల్‌: సంక్రాంతి వస్తుందంటే ఇళ్ల ముంగిళ్లు సప్తవర్ణాల హరివిల్లులవుతాయి. మహిళలు ఇప్పటికే ఇళ్ల ముందు అందమైన ముగ్గులను కనుల పండువగా తీర్చిదిద్దుతున్నారు. సాధారణంగా మహిళలు తమ ముగ్గుల్లో కొత్తదనం చూపేందుకు ఉత్సాహం చూపుతుంటారు. పత్రికల నుంచి సేకరించుకున్న ముగ్గుల్లో కొద్దిమార్పులు చేసి తమదైన శైలిలో రంగులు అలంకరిస్తుంటారు. ప్రస్తుతం వారికి సమస్య లేకుండా ముగ్గుల పుస్తకాలు మార్కెట్లలో అందుబాటులోకి వచ్చాయి. వీటికి జిల్లా అంతటా డిమాండ్‌ ఉంది.

రంగురంగుల పుస్తకాలు

ముగ్గు చక్కగా కుదిరితే.. దాన్ని అందరూ ప్రశంసిస్తుంటే అతివలు మురిసిపోతుంటారు. ముత్యాల ముగ్గులు వేయాలన్న తపన ఉన్నా వేయలేని వారి కోసం మార్కెట్‌లో దాదాపు 30 రకాల ముగ్గుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 నుంచి 40 పేజీలతో ఒక పేజీకి ఒకటి నుంచి నాలుగు రంగుల ముగ్గులను ప్రచురిస్తున్నారు. ఇందులో చుక్కల ముగ్గులు, డిజైన్‌ ముగ్గులు, కాన్సెప్ట్‌ ముగ్గులు కూడా ఉన్నాయి. ఎన్ని చుక్కలు పెట్టాలో, ఎలా కలపాలో, రంగులు కాంబినేషన్‌ వివరాలు ఈ ముగ్గుల వద్ద రాసి ఉంటాయి. ఒకటి, రెండుసార్లు సాధన చేసి నేరుగా 'ముగ్గు'లోకి దిగేయడమే ఆలస్యం. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచి ఈ పుస్తకాలకు మంచి డిమాండ్‌ ఉంటోంది. సంక్రాంతి దగ్గర పడుతుండడంతో ఇళ్ల ముందు మహిళలు పోటీల కోసం సాధన చేయడంలో భాగంగా రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దుతున్నారు.సీజన్‌ మాత్రమేగాక మిగతా రోజుల్లో కూడా ముగ్గుల పుస్తకాలకు డిమాండ్‌ ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సంజీవరాయా..కరుణించవయ్యా..

- ఘనంగా స్వామికి పొంగళ్లు
- పురుషులు మాత్రమే నైవేద్యం సమర్పణ
- ఎక్కడాలేని వింత ఆచారం

పుల్లంపేట: పుల్లంపేట మండలం, తిప్పాయిపల్లి గ్రామంలో ఆదివారం సంజీవరాయస్వామికి పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. 1516 సంవత్సరం పూర్వీకుల కాలం నుంచి ఇప్పటి వరకు మహిళలకు ఆలయంలో ప్రవేశం ఉండదు. పురుషులే స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రసాదాలను కూడా వారే పంచిపెట్టడం ఆనవాయితీ. గ్రామస్తులు కథనం మేరకు తమ పూర్వీకులు పాడి ఆవులు మేపుకుంటూ జీవనం సాగించేవారు. అప్పట్లో గ్రామంలో వంద ఆవులు వింత వ్యాధి సోకి మరణించాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఆసమయంలో అడవిలో ఒక మునీశ్వరుని వద్దకు వెళ్లి ఆవుల వింతవ్యాధి గురించి వివరించారు. దీంతో ఆ సాధువు మీకు ఒక బండరాయిపై భీజాక్షరంతో ఒక శిలాఫలకం అందజేస్తానని, దానిపై గుడి నిర్మించరాదని, మహిళలకు ప్రవేశం లేదని, మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేయరాదని సాధువు వారికి సూచించారు. వారిచ్చిన శిలాఫలకాన్ని గ్రామంలో ప్రతిష్టించినప్పటి నుంచి గ్రామంలో పాడిపశువులు అభివృద్ధి చెందడంతోపాటు పంటలు బాగా పండుతున్నాయని ప్రజల నమ్మకం. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ పూర్వీకులు ఆచరించిన ఆచారాన్ని ఆచరిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం పురుషులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. నియోజకవర్గ సీనియర్‌ నాయకులు కొల్లం గంగిరెడ్డి కుటుంబ సమేతంగా సంజీవరాయ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ ముద్దా బాబుల్‌ రెడ్డి స్వామివారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో సంజీవరాయస్వామి, స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న పురుషులు

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా 198 న్యాయవిజ్ఞాన సదస్సులు

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు, జిల్లా పంచాయతీరాజ్ ఆఫీస్, ఎన్జీఓస్, పారా లీగల్ వలంటీర్‌లు తదితరుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 198 న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ న్యాయవిజ్ఞాన సదస్సుల్లో నల్సా పథకాలు, రాజ్యాంగ హక్కులు, విధులు, మహిళా సాధికారత, సాంఘిక సంక్షేమ పథకాలు, స్త్రీలు, పిల్లలు, వైకల్యం ఉన్న వ్యక్తులు, కార్మిక చట్టాలు, ఉపాధి పథకాలు, భూమి లేక ఆస్తి సమస్యలు, కుటుంబ విషయాలు తదితర అంశాలను వివరించారు. అలాగే టోల్‌ఫ్రీ నంబర్లు 181, 1098, 14567, 112, 100లపై అవగాహన కల్పించారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : దూదేకుల కులస్తులు విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని లెవెన్త్ బెటాలియన్ రిటైర్డ్ కమాండెంట్ రాజకిశోర్‌బాబు అన్నారు. ఆదివారం నగరంలోని ఎర్రముక్కపల్లెలోగల దూదేకుల భవన్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దూదేకులు సమాజంలో నేటికీ అట్టడుగున ఉన్నారని, వీరు అభివృద్ధి చెందేందుకు విద్యే ఏకైక సాధనమని తెలిపారు. విద్య ద్వారానే పేదరికాన్ని అధిగమించగలమన్న సంగతి అందరూ గుర్తించుకోవాలని సూచించారు. దూదేకుల సంక్షేమ సంఘ పటిష్టతకు అందరూ తమవంతు కృషి చేయాలన్నారు. దూదేకుల భవన్ అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సుబాన్, గౌరవాధ్యక్షులు చిన్న పీరయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బైకుకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని దుండగులు

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో తలారి గోవర్ధన్‌కు చెందిన బైకుకు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టడంతో కాలి పోయింది. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ జె. రవికుమార్ వివరాల మేరకు తలారి గోవర్ధన్ రోజు మాదిరి ఇంటి బయట తన ద్విచక్రవాహనం పెట్టాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో ద్విచక్రవాహనం నుంచి పెద్ద మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే బైకు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేకల రమేష్ (32) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో ఆదివారం తన ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీకేదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి సమాచారం మేకు మేకల రమేష్ తన ఇంటిలో ఎవ్వరూ లేని సమయాన్ని చూసి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు ఇంటి తలుపులు పగులకొట్టి రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినటు తెలిపారు.

ఇది ఉద్యోగుల ప్రభుత్వం

ఏపీఎస్‌టీఎఫ్ ఆవిర్భావ సభలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఎస్‌టీఎఫ్ ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ఇది ఉద్యోగుల ప్రభుత్వమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం కడపలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నూతన ఉపాధ్యాయ సంఘమైన ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీ ఎస్‌టీఎఫ్) ఆవిర్భావ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, జిల్లా పరిషత్తు చైర్మెన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయాల్సిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అలాగే ఉద్యోగులకు డీఏ, పీఆర్‌సీ బకాయిలను కూడా చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నాడు నేడు కింద బడులకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. నూతనంగా ఏర్పాటైన ఎస్‌టీఎఫ్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పలు ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా పరిషత్తు చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ వంతుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడేందుకు ముందుంటామన్నారు. నూతన ఉపాధ్యాయ సంఘం ఏపీఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బరాజుయాదవ్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఆవిర్భవించిన సంఘమే ఏపీఎస్‌టీఎఫ్ సంఘం అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉండి సమస్యలను ప్రభుత్వం పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ నాయకులు రామలక్ష్మిరెడ్డి, తుపాకుల మురళి, వెంకటసుబ్బయ్య, రామచంద్ర, రవిశంకర్, శ్రీనివాసులు, మంచా వెంకటసుబ్బయ్య, రామసుభాష్‌రెడ్డి, రాముడు, దిలీప్, సాగర్, శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎనలేని కృషి

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



గౌడ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వెనుకబడిన వర్గాల(బీసీలు) సంక్షేమం, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఊటుకూరులోని ఎంకే కళ్యాణ మండపంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో బీసీల్లో 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారన్నారు. జిల్లా కేంద్రంలోని కడప నడిబొడ్డున బీసీ భవన్ కోసం విలువైన స్థలాన్ని కేటాయించి రూ.5.95కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం నిధి ఏర్పాటు చేయాలని, రేణుక యల్లమ్మ ఆలయం, కళ్యాణ మండపం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు కేజీ కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు చిదానందగౌడ్, కృష్ణయ్య గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. లింగమూర్తి, జెడ్పీటీసీ శివరాంగౌడ్, అన్నమయ్య జిల్లా గౌడ సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర, చండీగఢ్ మ్యాచ్ ప్రారంభం

రాణించిన ఆంధ్రా బౌలర్లు



తలపడుతున్న ఆంధ్ర, చండీగఢ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర, చండీగఢ్ మ్యాచ్ ప్రారంభమైంది. ఆంధ్రా క్రికెట్ సంఘం సీఈఓ ఎం.వెంకటశివారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీఏ సౌత్‌జోన్ కన్వీనర్ పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు ఎ. రెడ్డి ప్రసాద్, ఎల్. మునికుమార్‌రెడ్డి, విష్ణుమోహన్‌రావు, రెహమాన్, శ్రీనివాస్, రెఫరీ రోహిత్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వీరు ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు.

బౌలర్ల హవా..

ఆదివారం నిర్వహించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన చండీగఢ్ జట్టు 53.2 ఓవర్లలో 186 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని యువరాజ్ చౌదరి 128 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్‌లతో 101 పరుగులు చేశాడు. ఈయనకు జతగా దిండ్సా 37 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లు గిరినాథ్‌రెడ్డి 5 వికెట్లు, ఎం. ఆంజనేయులు 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 68 పరుగులు చేసింది. జట్టులోని కె. మహీప్‌కుమార్ 41 పరుగులు, టి. వంశీకృష్ణ 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

గృహహింస కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని యనమలచింతల గ్రామానికి చెందిన చెంచు వెంకటరెడ్డి కుమార్తె చెంచు గీతను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడనే కారణంగా ఎస్.ఆనంద్‌రెడ్డి పై గృహహింస కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ జె.రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు యనమలచింతల గ్రామానికి చెందిన వెంకటరెడ్డి కుమార్తె గీతకు 2021 సంవత్సరం ఫిబ్రవరి నెలలో బెంగళూరుకు చెందిన ఆనంద్‌రెడ్డితో వివాహమైంది.కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని గీత చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ జనరల్ ప్రెసిడెంట్‌గా ఆచార్య కిరణ్‌క్రాంతి చౌదరి, ఉపాధ్యక్షులుగా డా.ఎ.ఆర్.రెడ్డి, కె.వి.రమణమూర్తి, డా.బి.ఆర్.ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డా.ఎం.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కె.సూర్యనారాయణ, డా.వై.రఘు, డా.జి.సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డా.అరవింద్‌కుమార్, డా.ఎన్.కృష్ణారెడ్డి, డా.వి.శ్రీనివాస్, డా.ఖాజావలి, డా.ఎస్. మహబూబ్‌బాషా, డా.జి.రామకృష్ణ, డా.బడే సాహెబ్, డా.సయ్యద్ మీర్‌అహ్మద్, డా.ఎస్.రాజ్‌మహ్మద్, డా.కె.సుధాకర్, డా. సోమశేఖర్, డా.లక్ష్మీరూపవాణి, డా.లీలావతి, కె.గంగయ్య ఎన్నికయ్యారు.

మద్యం తాగొద్దన్నందుకు కూలీ ఆత్మహత్య

బి.కొత్తకోట : మద్యం అలవాటు మానుకొమ్మని చెప్పిన భార్యపై అలక వహించిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కె.రామమోహన్ తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె తాలూకా గౌరిబిదనూరుకు చెందిన పూసల మునిరాజ (30) బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం కంబాలపల్లెకు చెందిన శోభ దంపతులు. మునిరాజ మద్యం సేవిచి తరచూ భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగొద్దని చెప్పినందుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏపీసీబీఈఏ నూతన కార్యవర్గం

ప్రెసిడెంట్‌గా వెంకటసుబ్బారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్‌గా నరసయ్య ఎన్నిక



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీబీఈఏ) వైఎస్సార్ జిల్లా ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం కడపలోని డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా నరసయ్య, జనరల్ సెక్రటరీగా షకీలాబాను, జాయింట్ సెక్రటరీగా వెంకటరమణారెడ్డి, ట్రెజరర్‌గా అశోక్‌కుమార్, డైరెక్టర్లుగా వెంకటసుబ్బయ్య, వెంకటశివమోహన్, నాగరాజు, రెడ్డిశేఖర్, నారాయణరెడ్డి, లక్ష్మికళ, శ్యామల, దస్తగిరిరెడ్డి, శశికళ, రమణ, సులోచనలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి బాటలో పయనించి పటిష్టంగా ఉంటేనే ఉద్యోగుల జీవితాలు బాగుంటాయన్నారు.

ఉత్సాహంగా ఫీల్డ్ ఆర్చరీ ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కడప పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఫీల్డ్ ఆర్చరీ ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ రామమోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి వర్ది చెన్న కేశవ మాట్లాడుతూ ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా చక్కటి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. అనంతరం అండర్-10, 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద యువకుడు గల్లంతు



నదిలో గల్లంతైన సుదర్శన్‌రెడ్డి

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద సరదాగా ఈత కొట్టేందుకు వచ్చిన కమలాపురం మండలం కోగటం గ్రామానికి చెందిన కనపర్తి సుదర్శన్ రెడ్డి అనే యువకుడు ఆదివారం గల్లంతయ్యాడు. ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపిన సమాచారం మేరకు కోగటంకు చెందిన సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రెహమాన్ అనే ముగ్గురు యువకులు ఆదివారం సాయంత్రం సరదాగా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వచ్చారు. వీరిలో సుదర్శన్‌రెడ్డి పెన్నా నదిలోకి దిగి కొద్ది సేపు ఈత కొట్టిన తరువాత బాకరాపురం సమీపంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విష్ణువర్ధన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేక పోయింది. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సోమవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలను చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆదివారం జిల్లాలో జరిగిన ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 పరీక్షలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాలు, సూచనలతో ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ తెలిపారు. జిల్లాలో 19 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 8024 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 5046 మంది (71.61 శాతం) హాజరు కాగా, 2278 మంది (28.39 శాతం) గైర్హాజరయ్యారన్నారు.మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు 5723 మంది (71.32 శాతం) హాజరు కాగా 2301 (28.68 శాతం) మంది గైర్హాజరయ్యారని డీఆర్వో తెలిపారు.

లైజన్ ఆఫీసర్‌గా కడప ఆర్డీఓ

ఆదివారం జిల్లాలో జరిగిన ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 పరీక్షలో భాగంగా వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కేంద్రానికి లైజన్ ఆఫీసర్‌గా కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి వ్యవహరించారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను లైజన్ అధికారులుగా నియమించారన్నారు. వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తూ పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు.

ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం



రేకుల ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో బి. వెంకటేశ్ అనే వ్యక్తికి చెందిన రేకుల ఇంటిపై అకస్మాత్తుగా విద్యుత్ స్తంభం కూలిపోయింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్‌కు చెందిన ఇంటి పక్కన గత కొంత కాలం నుంచి విద్యుత్ స్తంభం దెబ్బతిని ఉంది. ఈ విషయమై గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ లోపే స్తంభం కూలిపోయింది. కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. వెంటనే విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేసి స్తంభాన్ని ఇంటిపైనుంచి తొలగించారు. ఈ విషయమై జమ్మలమడుగు డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ శేషగిరిబాబును వివరణ కోరగా గ్రామంలో అలా దెబ్బతిని ఉన్న విద్యుత్ స్తంభాలు దాదాపు 11 ఉన్నట్లు గుర్తించామన్నారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని గ్రామానికి వెళ్లినప్పుడు విద్యుత్ స్తంభం తమ ఇంటి పక్కన ఏర్పాటు చేయవద్దు, ఎక్కడైనా ఏర్పాటు చేసుకోండి అని ప్రజలు సహకరించడం లేదన్నారు.

'క్రీడలకు చక్కటి ప్రోత్సాహం'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ మేయర్ , శాప్ డైరెక్టర్ తదితరులు

కడప స్పోర్ట్స్ : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ప్రోత్సాహం ఇస్తోందని కడప నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ బి.నిత్యానందరెడ్డి అన్నారు. కడపలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఆదివారం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్, జూనియర్ బాలుర విభాగం ఎంపికలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారుల కోసం కల్పించిన 2 శాతం రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాప్ డైరెక్టర్ మైఖెల్ డానియల్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 13, 14 తేదీల్లో కృష్ణాజిల్లా గన్నవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపికచేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్ రాజ్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, కోచ్ అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్లు

జూనియర్ విభాగం : పి.ప్రసాద్, ఎ.రెడ్డిరోహిత్‌కుమార్, ఎస్.జగన్‌మోహన్, ఎస్.అక్బర్, సి.మల్లికార్జున, బి. మురళీకృష్ణ, ఎన్.సాయికీర్తన్, జి.కె.చాన్‌బాషా, జె.వి.భూపతి, ఎస్.రజాక్, ఎస్.నాగేంద్ర, ఎం.గురువర్ధన్ స్టాండ్‌బై : జి.కె.హేమంత్, కృష్ణసాగర్, కె.కృష్ణచైతన్య, వి.విఘ్నేశ్వర్‌రెడ్డి, వి.వి.సర్వజిత్

సబ్‌జూనియర్ విభాగం : ఎస్.ఆదిశేషరెడ్డి, బి.సాయికుమార్, కె.వెంకటశ్రీరామ్, ఎ.విష్ణువర్ధన్, బి.తనూజ్, ఎం.ప్రతాప్, జి.వీరేంద్ర, గోపీనాథ్, మోక్షిత్, సి.అశోక్, వి.అబ్దుల్ రహీం, పి.చందు, స్టాండ్‌బై : సి.అశోక్, కె. రెహమాన్, నరసింహ.

హాకీ ఎంపికలకు విశేష స్పందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్ : కడప డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా కడప డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, శాప్ డైరెక్టర్ మైఖెల్ డానియల్ ప్రదీప్ కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. సీనియర్ హాకీ క్రీడాకారుడు ఎం.శేఖర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా మహిళల జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసులు, చూడామణి, విలియం, చిన్న, ప్రవీణ్, ఖాన్, దీపు, శౌరి, శ్రీనాథ్, కోచ్‌లు రమేష్‌బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళల జట్టు : ఎస్.నరసింహ, పి.జ్యోతి, డి.చిన్ని, డి.ఝాన్సీ, ఆర్.శైలజ, టి.శైలజ, ఎం.లావణ్య, ఎల్.హారతి, లక్ష్మీచరిత టి.శ్రీవిద్య, పుష్పావతి, ప్రవళ్లిక, సౌజన్య, యమున, చందు, శ్రీజయబాయ్, షహన, సుచిత్ర మేనేజర్ : వెంకటేష్, కోచ్ : అమీర్.

డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు క్రీడా పోటీలు



షటిల్ పోటీలో తలపడుతున్న ఉద్యోగులు

కడప అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ బ్యాంకు) ఆవిర్భావ దినోత్సవం ఫిబ్రవరి 8వ తేదీని పురస్కరించుకుని ఆదివారం కడపలోని ఆఫీసర్స్ క్లబ్‌లో కడప డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు, మండల కేంద్రాల్లో ఉన్న సహకార బ్యాంకు ఉద్యోగులకు మధ్య క్రీడా పోటీలను నిర్వహించారు. మొదటి రోజు షటిల్ టోర్నమెంట్ సింగల్స్ విభాగంలో కోడూరు సహకార బ్యాంకు ఉద్యోగి సుబ్రమణ్యం విన్నర్‌గా నిలువగా డీసీసీ బ్యాంకు డీజీఎం ప్రతాప్‌రెడ్డి రన్నర్‌గా నిలిచారు. అలాగే డబుల్స్ విభాగంలో విన్నర్‌గా రాజేంద్రప్రసాద్, రన్నర్‌గా చంద్రశేఖర్ నిలిచారు. అలాగే క్రికెట్, చెస్, క్యారమ్స్, టెన్నికాయట్స్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. విజేతలకు ఫిబ్రవరి 8వ తేదీ బహుమతులను ప్రదానం చేయనున్నారు.

కురుబ, కురమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



కురబ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బలశ్రీనివాసులును సన్మానిస్తున్న కార్యవర్గసభ్యులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ కురుబ, కురమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆదివారం ప్రకటించారు. మదనపల్లెలోని కురబ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాష్ట్ర కురుబ, కురమ సంఘం అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులు (అన్నమయ్య జిల్లా), గౌరవ అధ్యక్షుడిగా తట్టి అర్జునరావు(కృష్ణ, గోదావరి), జనరల్ సెక్రటరీగా వి.లింగమూర్తి (అనంతపురం), ట్రెజరర్‌గా కె.వి.చలపతి(హిందూపురం), వైస్ ప్రెసిడెంట్‌గా కోటకొండ నాగేశ్వరరావు(కడప), కె.రెడ్డికుమార్(తిరుపతి), కార్యదర్శులుగా వల్లిగట్ల వెంకటరమణ(పీలేరు), కె.సీతారామయ్య(నంద్యాల), బీరయ్య బుద్ధా(గుంటూరు), పోతప్ప గివ్విమణి(అనంతపురం), బి.నాగేంద్ర(అనంతపురం), పి.నాగభూషణం(చిత్తూరు), డి.కె.రమణ్ రామాంజనేయులు(అనంతపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కన్నేకల్ బాబు(కర్నూలు), కె.ఎస్.నంజుండప్ప(హిందూపురం), విఠల్‌గౌడ్ చిరుతల్ల(అనంతపురం), జి.రెడ్డెన్న(కడప), బి.శ్రీనివాసులు (నంద్యాల), గోవిందరావు కడిమి(పశ్చిమగోదావరి), ఆర్.హరినాథ్(చిత్తూరు)లతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.ఈశ్వరయ్య(అన్నమయ్య), బి.జగదీష్‌బాబు(అనంతపురం), శ్రీనివాసరావు బొమ్మగంటి(కృష్ణా), భూషణం బల్గా(గుంటూరు), వెంకటవాణి యారాసి(పశ్చిమగోదావరి), మల్లేశ్వరి యారాసి(తూర్పుగోదావరి), జి.చంద్రశేఖర్(గుంటూరు), లీగల్ అడ్వైజర్‌లుగా పి.సుంకన్న(కర్నూలు), కె.రవిశంకర్(అన్నమయ్య), సీహెచ్.అంజయ్య(గన్నవరం)లను ఎంపిక చేశారు. రెండోసారి అధ్యక్షులుగా ఎంపికైన జబ్బల శ్రీనివాసులును రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్మానించారు.